నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, మంగళవారం 19 నవంబర్ 2024 | PEDDAPALLI

వేములవాడకు 80 వేలకుపైగా..

వేములవాడ టౌన్,నవంబర్ 18 : వేములవాడ రాజన్న ఆలయం సోమవారం కార్తీక శోభను సంతరించుకున్నది. సుమారు 80 వేలకు పైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడంతో కిట కిటలాడింది. ఈ సందర్భంగా భక్తులు వెలిగించుకున్న నేతిదీపాలతో రాజన్న క్షేత్రం దేదీప్యమానంగా వెలిగిపోయింది. వివిధ ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు సుమారు ₹34 లక్షల ఆదాయం సమకూరింది.

ప్రతి నిర్వాసితుడికీ ₹5.04 లక్షలు ఇవ్వాలి

వేములవాడ రూరల్, నవంబర్ 18 : మిడ్‌మానేరు ప్రాజెక్టులో ముంపునకు గురైన నిర్వాసితులందరికీ ₹5.04 లక్షలు ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. వేములవాడ మండలం అనుపురంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పీసీసీ హోదాలో రేవంత్‌రెడ్డి రుద్రవరంలో బస చేశారని, ఇప్పుడు సీఎం హోదాలో వేములవాడకు వస్తున్నందున, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. ఆయన చెప్పిన విధంగా నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం ఇచ్చిన 4,696 ఇండ్ల నిర్మాణానికి తోడు ఇండ్లు కట్టుకున్నవారికి సైతం డబ్బులు ఇవ్వాలని కోరారు. అలాగే, ఇళ్లు, భూ పరిహారం, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, మాజీ ఎంపీపీ బూర వజ్రమ్మబాబు, మాజీ సర్పంచ్ కొండపల్లి వెంకటరమణరావు, జక్కుల నాగరాజు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, రెడ్డవేణి పర్శరాములు, వనపట్ల సందీప్‌రెడ్డి, అభిమన్యు, భూమల్ల లక్ష్మన్, నరిహంరెడ్డి, నరేశ్, శ్రీధర్, మల్లేశం, తిరుపతి, శ్రీనివాస్, కనకరాజ్, నిరంజన్ పాల్గొన్నారు.

నిర్వాసితులను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నెలల్లో మిడ్ మానేరు సమస్యలను పరిష్కరిస్తామని, ప్రతి ఇంటికీ ₹5.4 లక్షలు ఇస్తామని, యువతీ యువకులకు ప్యాకేజీ

ఇస్తామని, ఇండ్ల సమస్యలు పరిష్కరిస్తామని, భూములు కోల్పోయిన వారికి జీవనోపాధి కల్పిస్తామని రేవంత్‌రెడ్డి గతంలో అనేక సభలు, సందర్భాల్లో పదే పదే చెప్పారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక్క సమస్యా పరిష్కరించలేదు. కాంగ్రెస్ మాటలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారు. కానీ, ఇప్పుడు మాత్రం మాట మార్చి కొంత మందికే ఇండ్ల నిర్మాణం కోసం పైసలు ఇస్తామని చెప్పడం అన్యాయం. తాజాగా ఇచ్చిన జీవోను మొత్తం నిర్వాసిత కుటుంబాలకు వర్తింపచేయాలి. ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే ముందే ఈ ప్రకటన చేయాలి. లేదంటే నిర్వాసితుల ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుంది. అంతేకాకుండా, ఇందిరమ్మ ఇండ్లతో లింకు పెట్టకుండా చీఫ్ మినిస్టర్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద నిధులు కేటాయించి ముఖ్యమంత్రి తన చిత్తశుద్ధిని చాటుకోవాలి.

- జక్కుల నాగరాజు, ముంపు బాధితుడు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు

నిర్వాసితులందరికీ ఇవ్వాలి

ఇండ్ల నిర్మాణంతో సంబంధం లేకుండా

నిర్వాసితులందరికీ ₹5.04 లక్షలు ఇవ్వాలి. ఇండ్లు కట్టుకోని వారికి మాత్రమే ఇస్తామంటే ఎలా? మేం అప్పులు చేసి ఇండ్లు కట్టుకున్నం. ప్రభుత్వం మమ్మల్ని కూడా పట్టించుకోవాలి. మాకు కూడా డబ్బులు ఇవ్వాలి. మా ఇండ్లను చూసి మాకు బాధలు లేవంటే ఎలా? ఉన్నదంతా ఇండ్ల కోసమే ఖర్చు చేసినం. ఇప్పుడు ఉపాధి లేదు, డబ్బులు లేవు. నిర్వాసితులందరినీ ఒకే రకంగా చూడాలి.

- వనపట్ల సందీప్‌రెడ్డి, అనుపురం

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన విధంగా ప్రతి నిర్వాసితుడికీ ₹5.04 లక్షలు

ఇవ్వాలి. ఇల్లు కట్టుకోని వారికి ₹5 లక్షలు ఇస్తామంటున్నరు. కానీ, మేం అప్పులు చేసి ఇల్లు కట్టుకున్నం. మా సంగంతి ఏంటి? ఎన్నికల్లో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇచ్చిన హామీ మేరకు మా అందరికీ ₹5.04 లక్షలు ఇవ్వాలి. ముంపు గ్రామాల నిర్వాసిత కుటుంబాలకు న్యాయం చేయాలి. మేం కొత్తగా అడిగేది ఏమిలేదు. మాకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. అందరికీ వచ్చేలా జీవో తీసుకురావాలి.

- జింక శ్రీధర్, అనుపురం

మధ్యమానేరు ముంపు గ్రామాల్లో కాంగ్రెస్ మాయాజాలం?

వేములవాడ మండలం అనుపురంలో నినదిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మరోసారి గోల్‌మాల్ చేసేందుకు ప్రయత్నం • నిర్వాసితులందరికీ ఇండ్ల నిర్మాణం కోసం ₹5.4 లక్షలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్లుకు లింకుపెట్టడంతోపాటు నిర్వాసితుల కుదింపు • ఇప్పటివరకు ఇండ్లు కట్టుకోనివారికే స్కీం వర్తింప చేస్తూ జీవో జారీ అప్పు చేసి ఇండ్లు నిర్మించుకున్న వారి పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు • స్పష్టత ఇవ్వకుండా దాటవేసేందుకు నేతల ప్రయత్నం లబ్ధిదారులకు చెల్లింపులపై అస్పష్టత • ఈనెల 20 ముఖ్యమంత్రి వేములవాడ పర్యటన సీఎం అయినా స్పష్టత ఇస్తారా..? లేదా? అన్నదానిపై ముంపుగ్రామాల్లో చర్చ

మధ్యమానేరు ముంపు గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాయాజాలం ప్రదర్శిస్తున్నది. నిర్వాసితులను అన్నిరకాలుగా ఆదుకుంటామని ఎన్నికల ముందు పదే పదే ఊదరగొట్టిన ఆ పార్టీ, ఇప్పుడు మాట మార్చింది. ఇండ్ల నిర్మాణం కోసం నిర్వాసితులందరికీ ₹5.4 లక్షలు ఇస్తామని చెప్పినా.. ఇప్పుడు అధికారంలోకి రాగానే కేవలం నిర్మించుకోని వారికి మాత్రమే ఇందిరమ్మ స్కీం కింద ₹5 లక్షలు వర్తింప జేస్తామంటూ తాజాగా జీవో జారీ చేసింది. దీంతో ప్రభుత్వ ద్వంద్వ విధానంపై విమర్శలు వెల్లువెత్తుతుండగా.. అప్పుచేసి ఇండ్లు కట్టుకున్న తమకెందుకు ఈ స్కీం వర్తింప చేయరో చెప్పాలని వస్తున్న ప్రశ్నలకు ఇటు నాయకులే కాదు ప్రభుత్వం కూడా దాటవేసే ధోరణికి పాల్పడుతున్నది. మరోవైపు నిర్వాసితులకు పేమెంట్ ఎలా చేస్తారన్న దానిపై జీవోలో స్పష్టత లేకపోవడం సందేహాలకు తావిస్తుండగా, ఏదేమైనా ఈ స్కీం నిర్వాసితులందరికీ వర్తింపచేయాలన్న డిమాండ్ పెరుగుతున్నది. ఈ నెల 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడకు వస్తుండగా.. నిర్వాసితుల ఇండ్లకు మంజూరు చేసిన జీవోపై వెల్లువెత్తుతున్న అనుమానాలపై స్పష్టత ఇస్తారా..? లేదా..? అన్నదానిపై ప్రస్తుతం ముంపు గ్రామాల్లో చర్చ నడుస్తున్నది.

కరీంనగర్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 2.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంలో భాగంగా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద మానేరు వాగుపై 2005-06లో మధ్యమానేరు ప్రాజెక్టుకు పునాది రాయి పడింది. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది. అందులో 9 గ్రామాలు పాక్షికంగా, మరో 9 గ్రామాలు పూర్తిగా మంపునకు గురయ్యాయి. నిబంధనల ప్రకారం 2009లో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ఆనాడు కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం చూపుతూ వచ్చింది. 2006 ఫిబ్రవరిలో ₹406 కోట్ల అంచనాలతో ప్రాజెక్టు నిర్మాణానికి టెండర్లు పిలువగా జడ్‌వీఎస్-రత్నా, సుషి కంపెనీలు జాయింట్ వెంచర్‌గా 16.5 శాతం లెస్‌తో ₹339.39 కోట్లకు కాంట్రాక్టు దక్కించుకున్నాయి. 2009 మార్చి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉండగా.. కాంట్రాక్టు సంస్థ మధ్యలోనే చేతెలెత్తేసింది. సదరు సంస్థపై చర్యలు తీసుకొని, ప్రాజెక్టును పూర్తి చేయించాల్సి ఉన్నా కాంగ్రెస్ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. కేవలం ₹77 కోట్ల విలువైన పనులు చేసి, ఆ మేరకు బిల్లు తీసుకొని వెళ్లిపోయినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించింది. ఫలితంగా 2009 నుంచి ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. తిరిగి 2010 ఆగస్టులో ₹454 కోట్ల అంచనాలతో టెండర్లు పిలిచినా.. తర్వాత సాంకేతిక కారణాలంటూ రద్దు చేశారు. మళ్లీ రెండేళ్ల తర్వాత అంటే 2012లో ₹454 కోట్ల అంచనాలతో టెండర్లు పిలువగా, 20.05 శాతం లెస్‌తో ₹361 కోట్లకు ఐవీఆర్‌సీఎల్ సంస్థ పనులను దక్కించుకున్నది.

మిడ్‌మానేరులో తేలిన ముంపు గ్రామం

ఆ నాడు పోలీసు పహారా మధ్య భూమిపూజ

ఐవీఆర్‌సీఎల్ కాంట్రాక్టు సంస్థ దక్కించుకున్న తదుపరి పనులకు భూమిపూజ చేయడానికి ఆనాడు 2012 ఏప్రిల్ 23న భారీ నీటిపారుదల శాఖ మంత్రి సుదర్శన్‌రెడ్డి ప్రాజెక్టు వద్దకు వచ్చారు. అప్పటికే మాయమాటలతో విసిగి వేసారిన నిర్వాసితులు వేల సంఖ్యలో తరలివచ్చారు. పరిహారం చెల్లింపులో జాప్యం, ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం, పరిహారంలో అక్రమాలకు పాల్పడడం, ఇచ్చిన పరిహారం విడుతల వారీగా ఇవ్వడం వంటి అంశాలపై మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను అరగంట పాటు నిలదీశారు. 'మంత్రి గ్యోబాక్' అంటూ నినదించారు. ఇంకా ఎంత కాలం మోసం చేస్తారని మండిపడ్డారు. పూర్తి పరిహారం చెల్లించాకే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మంత్రుల రాకకు ముందుగానే ఆగ్రహంతో అక్కడ వేసిన సభావేదికను కూల్చివేశారు. సమస్యలపై మంత్రులను ప్రశ్నించే సమయంలో నిర్వాసితులను పోలీసులు అడ్డుకోవడంతో ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. ఒక దశలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పరిహారంతోపాటు పునరావాస పథకం కింద తమకు ఎప్పుడు? ఎలా సౌకర్యాలు కల్పిస్తారో.. ఎన్నిరోజుల్లో కల్పిస్తారో చెప్పాకే ఇక్కడి నుంచి వెళ్లాలని అడ్డుకున్నారు. అప్పుడు పోలీసుల పహారా మధ్యనే ఆనాడు మంత్రి సుదర్శన్‌రెడ్డి భూమి పూజ చేశారు. నిర్వాసితుల ఆగ్రహాన్ని గుర్తించిన మంత్రి నేరుగా రంగంలోకి దిగి, బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మొదటి దశ కింద ప్రాజెక్టులో ముంపునకు గురైన చీర్ల వంచ, శాభాష్‌పల్లి, నీలోజుపల్లె, కొదురుపాక గ్రామాల నిర్వాసితులకు రెండు నెలల్లో అంటే 2012 జూన్‌లోగా అన్ని రకాల పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. పరిహారం చెల్లింపు కోసం ప్రత్యేకాధికారులను నియమిస్తామన్నారు. దశలవారీగా.. వీలైనంత తొందరగా మిగిలిన ముంపు గ్రామాలకు పరిహారం చెల్లిస్తామని, రానున్న రెండున్నర ఏళ్లలో కరీంనగర్ జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, శాభాష్‌పల్లె వద్ద బ్రిడ్జి నిర్మిస్తామని, వరదకాలువపై క్రాస్‌రెగ్యులెటర్స్ నిర్మిస్తామని, నిర్వాసితుల డిమాండ్లను పరిష్కరిస్తామని హామీలు గుప్పించి వెళ్లిపోయిన తర్వాత పట్టించుకున్న వారే లేరు. ఒక్క మాటలో చెప్పాలంటే నిర్వాసితులను నిలువెల్లా మోసం చేసింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమే. ఆ తర్వాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది. అలాగే పెడెంగ్‌లో ఉన్న మెజార్టీ సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకెళ్లింది.

ఇప్పుడు మరో మాయాజాలం?

తాము అధికారంలోకి రాగానే ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తామని, అలాగే నిర్వాసితులందరికీ ఇండ్ల నిర్మాణం కోసం ₹5.4 లక్షల చొప్పున డబ్బులు ఇస్తామని, ఇవే కాకుండా పెద్ద మొత్తంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటూ.. గత ఎన్నికల సమయంలో అగ్ర నాయకుల నుంచి మొదలు ప్రస్తుత వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వరకు ఊదరగొట్టే మాటలు చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తున్నా.. నిన్నామొన్నటి వరకు ముంపు గ్రామాల సమస్యల పరిష్కరానికి ఒక్క చర్య తీసుకోలేదు. కనీసం వారిని పిలిచి మాట్లాడలేదు. కాగా, ఈనెల 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడ పర్యటన నేపథ్యంలో ముంపు గ్రామాల ప్రజలు అడ్డుకుంటారన్న సమాచారంతో హడావుడిగా జీవో విడుదల చేశారు. మధ్యమానేరు రిజర్వాయర్‌లో మొత్తం 10,683 నిర్వాసిత కుటుంబాలున్నాయని, అందులో 5,987 మంది లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకున్నారని, ఇంకా 4,696 మందికి సొంత ఇండ్లు లేవని, వీరికి మంజూరు చేయాలంటూ వచ్చిన అభ్యర్థన మేరకు.. ఇందిరమ్మ ఇండ్లు రాష్ట్ర రిజర్వ్ కోటా కింద ₹5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్టు పేర్కొంటూ ప్రభుత్వం జీవోఎంఎస్ నంబర్ 42ను ఈనెల 16న విడుదల చేసింది. ఇది కాంగ్రెస్ మరో మాయాజాలం అన్న విమర్శలే వస్తున్నాయి.

ఎన్నెన్నో అనుమానాలు

ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీవోపై ఎన్నో అనుమానాలు తలెత్తుతుండగా, బాధితుల నుంచి అనేక ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సొంత ఇండ్లు నిర్మించుకోని వారికే ఈ స్కీం వర్తింప జేయడం ఏంటని, గూడుచెదరి గుండెపగిలి.. అప్పులు చేసి సొంతిండ్లు నిర్మించుకున్న వారికి ఈ ప్యాకేజీ ఎందుకు వర్తింప చేయరన్న డిమాండ్ ప్రస్తుతం ముంపు గ్రామాల్లో వ్యక్తమవుతున్నది. బాధితులెవరైనా ముంపువాసులే కదా? అలాంటప్పుడు ఈ పక్షపాతం ఎందుకన్న చర్చ నడుస్తున్నది. మొత్తం 10,683 మంది నిర్వాసిత కుటుంబాలకు జీవోఎంఎస్ నంబర్ 42ను వర్తింప చేయాలని, దీనిపై ఈ నెల 20న ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే డబ్బుల చెల్లింపులోనూ అనేక ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. ప్రస్తుతం నిర్వాసితులు ఇండ్లు నిర్మించుకునేందుకు ఇస్తామంటున్న ₹5 లక్షలను ఎలా పేమెంట్ చేస్తారన్న దానిపై జీవోలో స్పష్టత లేదు. కొన్ని మిహాయింపులు వర్తింప చేస్తామని చెప్పారే తప్ప అవి ఎలాంటివన్నదానిపై వివరాలు లేవు. అంతే కాదు, ఈ డబ్బులు ఒకేసారి చెల్లిస్తారా? లేక మూడు నాలుగు స్టేజీల్లో ఇస్తారా? అన్న విషయంపైనా అస్పష్టత ఉన్నది. నిజానికి ప్రభుత్వం ఇప్పటికే ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ పథకం కింద ఇండ్లను మంజూరు చేస్తున్నట్టు గతంలో ప్రకటించింది. ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నది. వీటికి ప్రస్తుతం నిర్వాసితులకు ఇస్తున్న ఇండ్లకు ఏమైనా లింకు పెడుతారా? లేదా అన్నదానిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరమున్నది. అలాగే ఇప్పటికే ప్రభుత్వ ఖజానాలో డబ్బులు లేవని, ఉన్న సంక్షేమ పథకాలను అమలు చేయడమే కష్టమవుతున్నదని సర్కారే స్వయంగా చెబుతున్నది. ఈ పరిస్థితుల్లో జీవోఎంఎస్ నంబర్ 42 ప్రకారం ఎవరైనా నిర్వాసితులు ఇండ్ల నిర్మాణం మొదలు పెడితే, మధ్యలో నిధులు లేక బిల్లులు రాకపోతే ఎలా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ముందుగానే నిర్వాసితుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తేనే నమ్మకం ఏర్పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో బుధవారం వేములవాడకు వస్తున్న సీఎం చాలా అంశాలపై స్పష్టత ఇవ్వాలన్న డిమాండ్ వస్తున్నది. ప్రధానంగా జీవోఎంఎస్ 42ను నిర్వాసితులందరికీ వర్తింప జేస్తారా? లేదా? చెల్లింపులు ఎలా చేస్తారు? సొంతిల్లు లేదని చెబుతున్న 4,696 మందికి మించి ఎవరైనా ఉంటే ఎవరికి దరఖాస్తు చేసుకోవాలి? జాబితాలో ఏమైనా తప్పులు దొర్లితే బాధితులు అనుసరించాల్సిన మార్గాలు ఏమిటి? ముంపు గ్రామాల్లో ఉన్న పెడెంగ్ సమస్యలకు పరిష్కారం ఎలా చూపుతారు? అలాగే ఉపాధి కల్పనకు ఎటువంటి చర్యలు తీసుకుంటారు? అన్న దానిపై ముఖ్యమంత్రి క్లారిటీ ఇవ్వాలనే డిమాండ్ ప్రస్తుతం నిర్వాసిత గ్రామాల్లో వ్యక్తమవుతున్నది.

అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్‌కు వినతిపత్రం అందిస్తున్న రవీందర్‌సింగ్, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు

రెమ్యునరేషన్ పెంచాలి

• గ్రూప్-3 విధులు నిర్వర్తించిన ఐవోల డిమాండ్ • రవీందర్‌సింగ్‌తో కలిసి అదనపు కలెక్టర్‌కు విజ్ఞప్తి • సానుకూలం స్పందన

కరీంనగర్ కలెక్టరేట్, నవంబర్ 18: గ్రూపు -3 పరీక్షల్లో ఐడెంటిఫికేషన్ ఆఫీసర్ (ఐవో)లుగా పనిచేసిన వారికి ఇచ్చే రెమ్యునరేషన్‌పై ఏర్పడిన వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. ఈ మేరకు కరీంనగర్ అదనపు కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్ టీజీపీఎస్సీ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఈ నెల 17,18 తేదీల్లో గ్రూపు-3 పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. వీటి పర్యవేక్షణకు సంబంధించి పలువురు అధికారులను నియమించిన విషయం విదితమే. ముఖ్యంగా ప్రతి సెంటర్‌కు ఇన్విజిలెటర్లతో పాటు ఐడెంటిఫికేషన్ ఆఫీసర్ పేరిట కొంతమందిని నియమించారు. పరీక్ష రాయడానికి వచ్చిన ప్రతి అభ్యర్థినీ గేటు వద్ద పరిశీలించి.. హాల్‌టికెట్‌లోని ఫొటోకు వచ్చిన అభ్యర్థిని పోల్చి చూసి, ఒకే అని నిర్ధారించిన తర్వాతే ఐవోలు లోపలికి పంపిస్తారు. ఇది ఒక రకంగా కత్తిమీద సాములాంటిదే. ఏమాత్రం పొరపాటు జరిగినా ఐవోలకు ఇబ్బందే. కాగా, రెండు రోజులపాటు విధులు నిర్వర్తించిన ఐవోలకు ఒక్కొక్కరికి ₹700 చొప్పున రెమ్యునరేషన్ చెల్లించడానికి అధికారులు కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియానికి పిలిపించారు. అయితే రెండు రోజుల పాటు నిర్విరామంగా పనిచేసిన తమకు కేవలం ₹700 ఎలా ఇస్తారని సదరు ఐవోలు ప్రశ్నించడంతో వివాదం నెలకొంది. టీపీపీఎస్సీ నుంచి తమకు ఎంత రెమ్యునరేషన్ ఇవ్వాలని ఆదేశాలున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చే రెమ్యునరేషన్ ₹700 పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆడిటోరియం నుంచి బయటకు వచ్చి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు రవీందర్‌సింగ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన కలెక్టరేట్‌కు చేరుకొని ఐవోల ఆందోళనకు అండగా నిలిచారు. ముందుగా అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను విన్నవించారు. అదనపు కలెక్టర్ జడ్పీ కార్యాలయంలో ఉన్నారని తెలుసుకొని, రవీందర్‌సింగ్ ఐవోలను తీసుకొని అక్కడికి వెళ్లి రెమ్యునరేషన్ పెంచి ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. విన్నపాన్ని టీజీపీఎస్సీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు ప్రతిపాదనలు పంపిస్తున్నట్టు అదనపు కలెక్టర్ చెప్పారని రవీందర్‌సింగ్ తెలిపారు. నిజానికి అన్ని జిల్లాల నుంచి ఈ విన్నపాలను అదనపు కలెక్టర్లకు ఇప్పించి, న్యాయం జరిగేలా చూస్తామని రవీందర్‌సింగ్ తెలిపారు. తక్షణం స్పందించిన ప్రపుల్ దేశాయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇటు సమాచారం ఇవ్వగానే వచ్చి, తమకు అండగా నిలిచిన రవీందర్‌సింగ్‌కు ఐవోలు కృతజ్ఞతలు చెప్పారు.

రాష్ట్రంలో పోలీసు రాజ్యం

• మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, నవంబర్ 18: బీఆర్ఎస్ నాయకులపై కక్షసాధింపు చర్యలతో తెలంగాణలో పోలీసుల రాజ్యం నడుస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పోలీసులు సీఎం రేవంత్‌రెడ్డి ఏమి చెబితే అదే చేస్తున్నారని ఆరోపించారు. రామగుండంలో నలుగురు మహిళా కార్పొరేటర్లపై పోలీసు ఉన్నతాధికారి అసభ్య పదజాలంతో మాట్లాడడం దారుణమన్నారు. ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో డిప్యూటీ మేయర్‌పై పెట్రోల్ పోసిన వ్యక్తిపై పోలీసులు కేసునమోదు చేయలేదన్నారు. రామగుండం ప్రాంతంలోని తిలక్‌నగర్, లక్ష్మీనగర్, చౌరస్తాలో నిరుపేదల కట్టడాలను అక్రమంగా కూల్చివేశారన్నారు. ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా వారి జీవితాలను రోడ్డుపై పడేశారని మండిపడ్డారు. సింగరేణి, మున్సిపల్ అధికారులు ఈ కూల్చివేతలు ఎందుకు చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ కార్పొరేటర్ అనే ఒకే ఒక్క కారణంతో సిరి ఫంక్షన్‌హాల్‌ను కూల్చివేశారని ధ్వజమెత్తారు. హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ ఉన్నా కుట్రపూరితంగా కూల్చివేశారన్నారు. సమావేశంలో రామగుండం నగరపాలక డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, కవిత సరోజిని, రమణారెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, నాయకులు మేతుకు దేవరాజ్, నూతి తిరుపతి, పిల్లి రమేశ్, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, జడ్సన్, రాములు, శ్రావణ్, ఓదెలు, రామకృష్ణ, వెంకటేశ్ ఉన్నారు.

దళితులపై నిర్బంధకాండ

దళితబిడ్డలు తమకు రావాల్సిన దళితబంధు రెండో విడుత ఆర్థికసాయం అడుగడమే పాపమవుతున్నది. హుజూరాబాద్ నియోజకవర్గానికి కాదు, జిల్లాకు ఏ వీఐపీ వచ్చినా ప్రభుత్వం నిర్బంధం మోపుతున్నది. చివరకు పొరుగున ఉన్న వరంగల్ జిల్లాకు సీఎం వస్తున్నా.. అరెస్టుల పర్వం కొనసాగుతున్నది.

హుజూరాబాద్‌లో దళితబంధు లబ్ధిదారులపై పోలీసుల ఉక్కుపాదం

సీఎం రేవంత్ వరంగల్ పర్యటన నేపథ్యంలో ఇక్కడ ముందస్తు అరెస్టులు

ఖండించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: పోలీస్ స్టేషన్‌లో దళితబంధు సాధన సమితి నాయకులు

కరీంనగర్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ)/ హుజూరాబాద్ : దళితబంధు రెండో విడుత ఆర్థిక సాయం కోసం హుజూరాబాద్ నియోజకవర్గ దళితబిడ్డలు పదకొండు నెలలుగా తండ్లాడుతున్నారు. దళితబంధు సాధన సమితి పేరిట ఒక వేదికను ఏర్పాటు చేసుకొని నిరసనలు తెలుపుతున్నారు. తమ బ్యాంకు ఖాతాల్లో ఉన్న ఆర్థిక సహాయాన్ని విడిపించుకునే అవకాశం ఇవ్వాలని అధికారులు, మంత్రులు, అధికార పార్టీ పెద్దలను అనునిత్యం వేడుకుంటూనే ఉన్నారు. వారి విన్నపాన్ని పరిశీలించి న్యాయం చేయాల్సిందిపోయి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. రెండో విడుత ఆర్థిక సహాయం దేవుడెరుగు.. జిల్లాకు ఏ వీఐపీ వచ్చినా లబ్ధిదారులను పోలీసుస్టేషన్లలో నిర్బంధిస్తున్నది. చివరకు పొరుగున ఉన్న వరంగల్ జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నా వదిలిపెట్టడం లేదు. మంగళవారం సీఎం వరంగల్ పర్యటన నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచే అరెస్టులు కొనసాగించారు. ముఖ్యంగా నిరసనల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వారిని వేటాడారు. హుజూరాబాద్‌లో ముగ్గురిని, వీణవంకలో ఐదుగురిని, జమ్మికుంటలో ఎనిమిది మందిని, ఇల్లంతకుంటలో మరో నలుగురిని అరెస్టు చేశారు. అయితే, వీరిలో కొందరు గ్రూప్-3 రాయాల్సి ఉందని చెప్పినా వదిలి పెట్టలేదని తెలిసింది. కొందరు పరీక్ష రాసేందుకు తెల్లవారుజామునే వెళ్లగా, అలాంటి వారి ఇండ్ల వద్ద పోలీసులు కాపలా ఉండి, వారు ఇంటికి రాగానే స్టేషన్‌కు తీసుకెళ్లారు. జమ్మికుంటకు చెందిన ఓ లబ్ధిదారు గ్రూప్-3 రాసేందుకు కరీంనగర్ వెళ్లగా, ఆయన ఇంటి వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లను ఉంచినట్లు తెలిసింది. ఇంటి వద్ద పోలీసులు ఉన్నారని తెలియడంతో ఇంటికి రాకుండా ఉన్నా.. కూతురుకు జ్వరం రావడంతో తప్పని సరై ఇంటికి వచ్చి దవాఖానకు తీసుకెళ్లాడు. అయినా పోలీసులు అక్కడికి కూడా తమ వాహనంలో వెళ్లి స్టేషన్‌కు రావాలని హుకుం జారీ చేశారు. ఏదో నేరం చేసినట్టు ఇండ్లలోకి వచ్చి తీసుకెళ్లడం, ఇంట్లో లేకుంటే వచ్చేంత వరకు అక్కడే ఉండి పట్టుకెళ్లడం, స్టేషన్‌కు తీసుకెళ్లి నిర్బంధించడంతో తాము మానసికంగా కుంగిపోతున్నామని దళితులు వాపోతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సభలో నిరసన తెలిపే ఆలోచన తమకు లేకున్నా ఇలా నిర్బంధించడం సరికాదని స్పష్టం చేస్తున్నారు